




*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## బంధం

**ప్రమోద్ ఆ ఫైవ్ స్టార్** హాస్పిటల్‌లోని ఏసి వెయిటింగ్ హాల్‌లో ఖాళీగా ఉన్న ఓ కుర్చీలో కూలబడ్డాడు. అతని కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. అక్కడున్న అందరి పరిస్థితి దాదాపు అదే కాబట్టి అతన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

వెంటిలేటర్ మీదున్న తండ్రిని చూసినప్పటి బాధకంటే కూడా తనవాళ్ళ ప్రవర్తన ప్రమోద్‌ని ఇంకాస్త బాధకి గురిచేసింది. అంతా ఆయన చుట్టూ ఉండగా, తనొక్కడే ఇలా వంటరిగా ఉండాల్సి రావడం అతనికి నరకయాతనగా ఉంది.

"తల్లిపోయాక కన్నతండ్రి సవతి తండ్రవుతాడురా నాయనా" అమ్మమ్మ మాటలు గుర్తొచ్చాయి.

ప్రసాదరావు ఓ ఆదివారం సాయంత్రం భార్యతో ఫస్ట్‌షోకి వెళ్ళొస్తూండగా ఓ పాల వేన్ వెనకనించి వారి స్కూటర్‌ని గుద్దుకుంది. స్కూటర్ నడిపే ప్రసాదరావు, ముందు హేండిల్ బార్‌ని పట్టుకుని నుంచున్న మూడేళ్ళ ప్రమోద్ ఓ పక్కకి పడితే, అతని భార్య వారికి వ్యతిరేక దిశలో రోడ్డుమీదకి పడిపోయింది. పాలవాన్ ఆమె మీంచి వెళ్ళిపోయింది.

మరో ఏడాది గడిచాక, నాలుగేళ్ళ కొడుకుతో ప్రసాదరావు అత్తగారింటికి వచ్చాడు.

"వీడిని చూడడం నావల్ల కావడంలేదు. అదీగాక నేను..."

అతను రెండో పెళ్ళి చేసుకోబోతున్నాడని తెలిసిన అత్తగారు తన కూతురు రెండోసారి పోయినట్లు ఏడ్చింది. మనవడ్ని పట్టుకుని కుమిలి కుమిలి ఏడ్చింది. ప్రసాదరావు మౌనంగా మరో అరగంట ఉండి వెళ్ళిపోయాడు.

తండ్రి మీద బెంగతో ప్రమోద్ మంచమెక్కాడు. అమ్మమ్మ కబురు చేస్తే ప్రసాదరావు పెళ్ళి చేసుకోడానికి తిరుపతి వెళ్ళాడని తెలిసింది.

ఆరు నెలల తర్వాత వచ్చిన ప్రసాదరావు కొడుకుని గుండెలకి హత్తుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకున్నాడు. అత్తగారికి కొన్ని కాగితాలిచ్చి చెప్పాడు. "మీ అమ్మాయి ఏక్సిడెంట్‌కి నష్టపరిహారం ఇచ్చారు. మీ పేరు మీద బేంక్‌లో వేసాను. వడ్డీని వాడుకోండి. వాడిని బళ్ళో చేర్పించండి."

ముసలమ్మ ఆ మాటలకి ఇంకోసారి ఏడ్చి అల్లుడితో చెప్పింది. "ఇది పల్లెటూరు. ఇక్కడ చదువు ఏం చదువు? నీ దగ్గరైతే ఇంగ్లీష్ చదువులు చెప్పించచ్చు. పొద్దున్నే తయారు చేసి పంపడం, కేరేజీలు కట్టడం నావల్ల కాదేమో! నువ్వు తీసుకెళ్ళు"

ప్రసాదరావు పిల్లవాడ్ని దగ్గరకి పొదువుకుని విచారంగా చెప్పాడు.

"పిల్లగాడితో సంబంధాలు లేకుండా ఉంటేనే పెళ్ళి చేసుకుంటానంది అత్తయ్యా"

ప్రమోద్ ఆ పల్లెటూరి వీధి బడిలోనే చేరాడు. స్కూల్ ఇంటికి దగ్గరే కాబట్టి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేవాడు. అమ్మమ్మ నిద్రపోతూంటే తనే వడ్డించుకుని తిని, అన్నిటికీ మూతలు పెట్టి, తిన్న కంచం బయట పడేసి వెళ్ళేవాడు.

ప్రసాదరావు నాలుగైదు నెలలకోసారి వచ్చి కొడుకుని చూసిపోతూండేవాడు. ప్రమోద్‌కి తండ్రంటే ఎంతో ఇష్టం. 'ఆయన మనతో ఎందుకుండడు?' అని అమ్మమ్మని సతాయించేవాడు. 'నీతో వస్తాను నాన్నా' అని తండ్రి కాళ్ళకి అడ్డం పడి ఏడ్చేవాడు.

మూడో తరగతి చదువుతున్నప్పుడు ప్రమోద్ మొదటిసారి తండ్రి ఇంటికి వచ్చాడు. ప్రసాదరావు తల్లితండ్రులకి పెళ్ళయి ఏభై ఏళ్ళయిన సందర్భంలో పెద్ద ఫంక్షన్ చేసుకోవాలనుకున్నారు. దానికి వారి పిల్లలు, వాళ్ళ పిల్లలు అంతా ఒక్కరు కూడా మానకుండా రావాలని ప్రసాదరావు తండ్రి అందరికీ ఫోన్ చేసి మరీ మరీ చెప్పాడు. అప్పుడే ఆయన ప్రసాదరావుకి చెప్పాడు.

"ప్రమోద్‌ని కూడా తీసుకురా. వాడు నా పెద్ద మనవడు."

తండ్రి మాటని ఎదిరించలేని ప్రసాదరావు అత్తగారికి వివరంగా ఉత్తరం రాసాడు.

అమ్మమ్మ మొదట ప్రతీకారంగా పిల్లాడిని పంపదల్చుకోలేదు. 'తల్లిలేని పిల్లాడిని ఒక్కరైనా వచ్చి చూసారా? ఇప్పుడు గ్రూప్ ఫోటో కోసం వాడు కావాల్సి వచ్చాడా' అని నిష్టూరాలాడింది. తర్వాత తమాయించుకుని, తనకేదైనా అయితే వాళ్ళే వాడిని చూసుకోవాలనే ముందు చూపుతో అంగీకరించింది.

తండ్రి దగ్గరకి వెళ్తున్నాడని తెలియగానే ప్రమోద్ ఆనందానికి అవధులు లేవు. ఊళ్ళో, బళ్ళో అందరికీ చెప్పాడు. 'ఎప్పుడు వెళ్ళేది?' అని అమ్మమ్మని సతాయించాడు.

ఆవిడ వాడిని దగ్గర కూర్చోపెట్టుకుని బుద్ధులు చెప్పింది.

"మీ నాన్నకి ఇంకో కొడుకు, కూతురు ఉన్నారు. వాళ్ళని నువ్వేమీ అనక. మీ పిన్నికి కోపం వస్తుంది."

"పిన్నా?"

"అదే మీ నాన్న పెళ్ళాం" పెడసరంగా చెప్పింది.

వాడికెన్నో బోధించి, బుద్ధిగా ఉండమని గట్టిగా చెప్పి పక్కింటి అబ్బాయితో ప్రసాదరావు ఇంటికి పంపించింది. తండ్రి దగ్గరకని సంబరపడుతూ వెళ్ళిన ప్రమోద్ తండ్రి ఇంట్లో లేకపోవడంతో నిరాశపడ్డాడు. కూడా వచ్చిన అబ్బాయి, తన పనైపోయినట్లు ప్రమోద్ పిన్నికి వాడిని అప్పగించి వెళ్ళిపోయాడు.

ఆవిడ అచ్చం ప్రసాదరావు పోలికలతో ఉన్నవాడిని ఓ నిమిషం నిశితంగా చూసి లోపలికి వెళ్ళిపోయింది. ఏం చేయాలో తోచక కొద్దిసేపు నుంచున్నాడు. కాళ్ళు నొప్పులు పుట్టి ఓ సోఫాలో కూర్చున్నాడు. ఓ నాలుగేళ్ళ పిల్లవాడు, మూడేళ్ళ పిల్ల వచ్చి ఓ మూల కూర్చుని బొమ్మలతో ఆడుకుంటున్నారు. అలాంటి బొమ్మలని ఏనాడూ చూడని ప్రమోద్ ఆసక్తిగా వాళ్ళతో కలిసి ఆడుకున్నాడు.

రాత్రి ఏడున్నరకి ఆమె మళ్ళీ ముందుగదిలోకి వచ్చింది. 'జూ' అని నోటితో శబ్దం చేస్తూ కారు బొమ్మని టీపాయ్ మీద తిప్పుతున్న ప్రమోద్‌ని పట్టించుకోకుండా పిల్లని ఎత్తుకుని పిల్లాడితో చెప్పింది.

"అన్నం పెడతారామ్మా"

ప్రమోద్‌కి కూడా ఆకలి తెలిసింది. ఆవిడ వంక ఆశగా చూసాడు. ఆమె వాడివంక చూడలేదు. పిల్లలిద్దరూ తల్లితో వెళ్ళిపోయారు. నిద్రొచ్చిన ప్రమోద్ సోఫాలోనె ముడుచుకుని పడుకుని నిద్రపోయాడు. ఎనిమిదన్నరకి వచ్చిన ప్రసాదరావు సోఫాలో పడుకున్న వాడిని చూసి భార్యని అడిగాడు.

"ఎప్పుడు వచ్చాడు వీడు? ఎవరు తీసుకువచ్చారు?"

"మూడున్నరకి వచ్చాడు. ఎవరో పక్కింటివాడు తెచ్చాడు. ఐనా మనం ఊరెళ్ళేది ఎల్లుండి కదా? రేపు తెచ్చి దింపచ్చుగా?" నిరసనగా చెప్పింది.

"ఏమైనా తిన్నాడా?" ఆ మాటలు పట్టించుకోకుండా అడిగాడు.

"ఏమో నాకేం తెలుసు?"

"నువ్వేమైనా పెట్టావా?" కోపాన్ని అణచుకుంటూ అడిగాడు.

"లేదు."

"పిల్లలేం చేస్తున్నారు?"

"నిద్రపోతున్నారు."

"వాళ్ళు తిన్నారా?"

ఆఁ"

"వాళ్ళతోపాటు వీడికీ ఓ ముద్దపెట్టచ్చుగా?" ప్రసాదరావు కంఠం వణికింది.

"ఏమో తోచలేదు."

ఇక ఆవిడతో మాట్లాడి వృధా అనుకున్న ప్రసాదరావు ప్రమోద్‌ని తడుతూ పిలిచాడు.

"ప్రమూ"

ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది. వాడు కళ్ళు తెరిచి తండ్రిని చూడగానే ఆయన మెడని రెండు చేతుల్తో చుట్టేస్తూ చెప్పాడు.

"నాన్నా! మీ ఇల్లు ఎంత బాగుందో"

వాడు ఆ గది దాటి లోపలికి వెళ్ళుండడని తెలిసిన ప్రసాదరావు విషాదంగా నవ్వి చెప్పాడు. "పద. అన్నం తిందాం"

టేబుల్ మీద గిన్నెలు పెట్టే పద్ధతి, వడ్డించే విధానాల బట్టి ఆమెకి తనంటే ఇష్టంలేదని వాడి చిన్నబుర్రకి తట్టింది. ఎప్పుడు తండ్రి ఇంటికి వచ్చినా నోరు మూసుకోకుండా కబుర్లు చెప్పేవాడు మౌనంగా పెట్టింది తిన్నాడు. వాడితో పిల్లల గదిలోకి నడుస్తున్న భర్తతో ఆమె చెప్పింది.

"మంచం చాలదు. చిన్ని కింద పడిపోతుంది."

ప్రసాదరావు ఓసారి దీర్ఘంగా ఆమెవైపు చూసి రెండు దుప్పట్లు తీసుకుని, ముందుగదిలోకి వచ్చి వాడిని ఓ సోఫాలో పడుకోపెట్టి, తను కింద పక్కవేసుకున్నాడు. వాడికి దుప్పటి కప్పి నెమ్మదిగా వీపుమీద తడుతూ నిద్రపుచ్చాడు.

భర్త కోసం అరగంటసేపు వేచి చూసిన ఆమె బయటకి వచ్చి చూసి చెప్పింది. "కింద పడుకున్నారేంటి? లేవండి. పదండి బెడ్‌రూములోకి"

"నువ్వు పడుకో. విడికి వంటరిగా పడుకునే అలవాటు లేదు. అర్ధరాత్రి భయపడతాడు."

ఆమె ధన్‌మని తలుపు మూసి విసురుగా వెళ్ళిపోయింది.

ప్రసాదరావు మర్నాడు సెలవుపెట్టి ఇంట్లోనే ఉన్నాడు.

"రేపటి నుంచి ఎటూ నాలుగురోజులు సెలవు పెట్టారు. ఇవాళ వెళ్ళొచ్చుగా" భార్య అడిగింది.

"ప్రమోద్ రాత్రి తొమ్మిదిదాకా ఆకలికి ఆగలేడు."

ఆమెకి ఆ మాటలు చెంపపెట్టులా అనిపించి వాడిని మింగేసేలా చూస్తూ చెప్పింది. "ఈ తద్దినం ఉంటే పెళ్ళిచేసుకోనని ముందే చెప్పాను. మాట తప్పారు."

"ఇంతకాలం మాట మీదే ఉన్నాను. ఈ నాలుగురోజులు మా నాన్న దగ్గర కొంచెం నటించు. వస్తూ వస్తూ దారిలోనే వీడిని వదిలి వస్తాను" కఠినంగా చెప్పాడు.

ప్రసాదరావు వాడి బట్టల సంచిని పరిశీలించి, వాడిని బజారుకి తీసుకెళ్ళి రెడీమేడ్ బట్టలు, సబ్బు, దువ్వెన, పాండ్స్ పౌడర్ డబ్బా కొనుక్కొచ్చాడు. సంచితో సహా వాటిని ఓ ఏర్ బేగ్‌లో సర్దాడు.

"తాతగారింట్లో అంతా బిజీగా ఉంటారు. నువ్వే స్నానం చేసి, డ్రెస్ చేసుకుని, పౌడర్ రాసుకుని, తలదువ్వుకోవాలి. ఏం?" కొడుకుని అడిగాడు.

"సరేనాన్నా" వాడు వాటన్నిటినీ ఆనందంగా చూస్తూ చెప్పాడు.

ఏరోజు ఏ బట్టలు వేసుకోవాలో వాడికి వివరంగా చెప్పాడు.

ఆ రోజు పిల్లలు బొమ్మల బుట్టతో సహా మాయమయారు.

"పిల్లలేరి?" ప్రసాదరావు చుట్టూ చూస్తూ అడిగాడు.

"ఆడుకోడానికి మా తమ్ముడింటికి పంపించా" వంటింట్లోంచి సమాధానం వచ్చింది.

"రేపు ప్రయాణం పెట్టుకుని ఇప్పుడీ పెత్తనాలేమిటి?" చిరాకు పడ్డాడు.

"మీరు పెత్తనాలకి వెళ్తూ వాళ్ళని తీసుకెళ్ళలేదని ఏడుస్తూంటేనూ..."

"ఛ" ప్రసాదరావు ఇక రెట్టించలేదు.

తాతగారింట్లో మొదటిరోజు అంతా వాడిని జూలో జంతువుని చూసినట్లుగా వింతగా చూసారు. రెండోరోజు పాతబడిపోయాడు. దూరంగా ఉండటంతో వాళ్ళకి వాడిమీద పెద్దగా ప్రేమాభిమానాలు కలగలేదు. ప్రసాదరావు తల్లిదండ్రులకి ప్రేమ ఉన్నా, కోడలికి జడిసి వాళ్ళూ అంటీ ముట్టనట్లే ఉన్నారు. అమ్మమ్మ చెప్పినట్లు గ్రూప్‌ఫోటోకే వాడు పరిమితమయ్యాడు.

ఆ తర్వాత పదోతరగతి పరీక్షలు ముగిసాక ఇంటర్మీడియట్‌లో చేరే విషయంలో సలహాకోసం ప్రమోద్ రెండోసారి తండ్రి ఇంటికి వెళ్ళాడు. పిన్ని ముభావంగా ఉంది కాని ఈసారి ద్వేషంగా లేదు. తమ్ముడు నిర్లక్ష్యంగా ఉంటే, చెల్లెలు ఆప్యాయంగా 'పెద్దన్నా' అని పలకరించింది.

ఇంట్లో వాళ్ళిద్దరూ ఇంగ్లీష్‌లో మాట్లాడుకోవడం గమనించాడు ప్రమోద్. టెన్త్ పరీక్షల రాసినా, తెలుగు మీడియం అవడంతో వాళ్ళు మాట్లాడే ఇంగ్లీష్‌ని అర్ధం చేసుకోవడం కష్టం అనిపించింది. తండ్రితో వాళ్ళకి ఉన్న చనువు, ఆ ఇంట్లో కనిపిస్తున్న ఐశ్వర్యం

చూసాక ప్రమోద్ తను పరాయివాడిగా, ఆ కుటుంబానికి చెందని వ్యక్తిగా ఫీలయ్యాడు. అతనికి కొంత బాధ, కొంత అసూయ కలిగాయి.

"ఇంటర్‌లో సి.ఇ.సిలో చేరదామనుకుంటున్నాను నాన్నా" తండ్రితో చెప్పాడు.

"నీకు మేథ్స్ బానే వచ్చు కదా? యం.పి.సి తీసుకో" తండ్రి సలహా ఇచ్చాడు.

"మన ఊళ్ళోని జూనియర్ కాలేజ్‌లో సైన్స్ గ్రూప్స్ లేవు నాన్నా. సిటీలో చదవాలంటే అమ్మమ్మ ఒక్కతే ఉండలేదు."

"సరే. నీ ఇష్టం. సెలవులేగా నాలుగు రోజులుంది వెళ్ళు" ప్రసాదరావు చెప్పాడు.

ఆ నాలుగు రోజులు ముళ్ళమీద ఉన్నట్లే ఉన్నాడు. తండ్రితో తమ్ముడు, చెల్లెలు ఒక స్నేహితుడితో ఉన్నట్లుగా ఉండటం, పిన్నికి, వాళ్ళకి తండ్రి ఇచ్చే ప్రాధాన్యత వాళ్ళిద్దరిలో కనిపించే ఆత్మవిశ్వాసం, వారు ఉపయోగించే వస్తువులు... ప్రమోద్ తనలో చెలరేగే ఈర్ష్య, అసూయలని అదుపులో ఉంచుకుని ఐదోరోజు పొద్దున్నే అందరికీ 'వెళ్ళొస్తా' అని చెప్పి బయలుదేరాడు. అతని రాక విషయంలో ఎంత ఉదాశీనంగా ఉన్నారో అలాగే పోక విషయంలో కూడా తలాడించి ఊరుకున్నారు.

ప్రసాదరావు మాత్రం అనేక జాగ్రత్తలు, సలహాలు చెప్పి పంపాడు.

బస్సెక్కబోయే ముందు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు కొనుక్కెళ్ళాడు.

ప్రమోద్ బికామ్ అవగానే బేంక్ పరీక్షలు రాసి క్లర్క్ ఉద్యోగం సంపాదించాడు. తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. చెల్లెలు మెడిసిన్ చదివింది. ఆ ఇంటికి తను 'ఆహ్వానింపబడని అతిథి' అని అర్ధమైన ప్రమోద్ మరీ అవసరమైతే తప్ప వెళ్ళలేదు. తండ్రి ప్రేమని పంచుకుంటున్న తమ్ముడిని, చెల్లెల్ని చూస్తే అతనికి గుండెల్లో కొంత మంటగా ఉండేది. 'అది నా స్థానం. మా అమ్మ బతికే ఉంటే నేను మీలా ఉండేవాడ్ని. నాన్నతో మీ అంత చనువుగా ఉండేవాడిని. మీలాగే వాదించేవాడిని, గారాబాలు పోయేవాడిని. మీకంటే ముందే నాన్న నన్ను ఎత్తుకున్నారు. ముద్దుపెట్టుకున్నారు. పోయింది మా అమ్మేకాని, తండ్రీ కొడుకుల బంధం కాదు' అనుకునేవాడు.

ప్రమోద్ పెళ్ళికి ప్రసాదరావు ఒక్కడే వచ్చాడు. అమ్మమ్మ ప్రశాంతంగా నిద్రలోనే కళ్ళుమూసినప్పుడు కూడా ప్రసాదరావే వచ్చి కొడుకుని ఓదార్చి వెళ్ళాడు. ప్రమోద్ తన కొడుక్కి ప్రసాద్ అనే పేరు పెట్టాడని తెలిసి 'నీకేం చేసానని నా పేరు పెట్టావు నాన్నా' అని బాధపడ్డాడు.

"ప్రమోద్! అన్నయ్యకి హార్ట్ అటాక్ వచ్చిందిరా. హాస్పిటల్‌లో ఉన్నాడు. నీకు కబురందిందా?" ప్రసాదరావు తమ్ముడు ఫోన్ చేసాడు.

"లేదు బాబాయ్. నాన్నకి ఎలా ఉంది?" ప్రమోద్ కంపిస్తూ అడిగాడు.

"సీరియస్ అంటున్నారా. వెంటనే బయల్దేరు" బాబాయ్ దుఃఖంగా చెప్పాడు.

వెంటిలేటర్ మీదున్న తండ్రిని చూసి ప్రమోద్ కన్నీరు మున్నీరయ్యాడు. తనకున్న ఆఖరి బంధం కూడా తెగిపోతుందని అతనికి అర్థమైంది.

"నాకు ఫోన్ చేయచ్చుగా పిన్ని."

అక్కడే ఉన్న పిన్నిని అడిగాడు.

"మా కంగారులో మేమున్నాం. నువ్వు గుర్తురాలేదు" తమ్ముడు కఠినంగా చెప్పాడు.

"అమ్మా! నాన్నకి ఎలా ఉంది?" అక్కడే ఉన్న చెల్లెల్ని అడిగాడు.

చెల్లెలు సమాధానం చెప్పలేదుకానీ ఆమె కళ్ళవెంట నీళ్ళు జలజలా రాల్చి.

ప్రమోద్‌కి సమాధానం అర్థమైంది. వేగంగా బయటకి వచ్చి ఆ ఫైవ్ స్టార్ హాస్పిటల్‌లోని వెయిటింగ్ హాల్‌లో కూర్చున్నాడు. అతని కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి.

"ప్రమోద్! అంతా అయిపోయిందిరా" బాబాయి వణికే గొంతుతో చెప్పాడు.

ఒక్క ఉదుటన లేచి పరిగెత్తాడు. తండ్రికి తగిలించిన పరికరాలన్నీ తీసేసారు. ఆయన మొహం ప్రశాంతంగా ఉంది. పిన్ని ఆయన ఛాతీ మీద తలపెట్టి ఏడుస్తుంటే, తమ్ముడు, చెల్లెలు ఆవిడకి చెరో పక్క కూర్చుని ఏడుస్తున్నారు. చుట్టూ పిన్నివైపు బంధువులు.

వాళ్ళని తోసుకుని వెళ్ళి తండ్రి చెయ్యి పట్టుకుని కొద్దిసేపు దుఃఖించాడు. అరగంట తర్వాత వాళ్ళవెంట తండ్రి ఇంటికి చివరిసారి వెళ్ళాడు. ఎవరూ అతని ఉనికిని పట్టించుకోలేదు. ఏడుస్తున్న భార్యాపిల్లల్ని ఓదార్చారు కానీ వాళ్ళకి ప్రమోద్ కూడా ప్రసాదరావు కొడుకే అని తట్టలేదు.

ఇంటి బయట వరండా మెట్ల మీద కూర్చుని మోకాళ్ళలో తలదూర్చి ఏడుస్తున్న ప్రమోద్ భుజం మీద ఓదార్పుగా చెయ్యివేసి బాబాయ్ చెప్పాడు.

"పదరా తల మీద నీళ్ళు పోసుకో. బ్రాహ్మడు వచ్చాడు."

"ఎందుకు బాబాయ్?" అయోమయంగా అడిగాడు.

"ఎందుకేమిట్రా. నువ్వు వాడి పెద్దకొడుకువి. తలకొరివి పెట్టాల్సింది నువ్వే"

ఆ మాట ప్రమోద్ మనసుని బలంగా తాకింది.

'అవును. ఎవరేం అన్నా తను నాన్నకి పెద్ద కొడుకు. నాన్నకి తనే చేయాల్సిన విధులు, ఆచారాలు ఉన్నాయి. తను ఈ ఇంటి సభ్యుడు కాకపోయినా నాన్నకి పెద్దకొడుకు.'

ఉప్పెనలా ముంచెత్తిన దుఃఖంతో ప్రమోద్ పినతండ్రిని అల్లుకుపోయాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments